ఏజెన్సీలో పెరిగిన చలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: గత రెండు రోజుల నుంచి ఏజెన్సీలో చలి తీవ్రత పెరిగింది. సాయంత్రం నుంచి తెల్లవార్లు వరకు మంచు వేసి చలి వేస్తుండటంతో గిరిజనులు మంటలు వేసుకొని చలి కాస్తున్నారు. మండలంలో గురువారం చలి తీవ్రత ఎక్కువ అవ్వడంతో గిరిజనులు అవస్థలు పడ్డారు. దీంతో చలిమంటలు వేసుకొని రక్షణ పొందుతున్నారు.

మంట కాగుతున్న పిల్లలు

కాఫీ కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం

- సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స- వంటావార్పుతో నిరసన

పాడేరులో వంటా వార్పు చేస్తున్న అప్పలనర్స, కాఫీ కార్మికులు

చింతపల్లిలో వంటా వార్పు చేస్తున్న చిన్నయ్యపడాల్

ప్రజాశక్తి-పాడేరు: మినుములురు కాఫీ ఎస్టేట్‌లో కాఫీ కార్మికులు, హెల్పర్ల సమస్యల పరిష్కారం కోసం కొనసాగుతున్న సమ్మె 8వ రోజుకు చేరుకుంది. గురువారం ఉదయం ఎస్టేట్ మేనేజర్ కార్యాలయం ఎదుట వంటావార్పు కార్యక్రమం తో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన సి.పి.ఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనరస, జిల్లా కమిటీ సభ్యులు వి. దాసు కాఫీ కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా. అప్పలనరస మాట్లాడుతూ. రోజు కూలీని రూ.400కి పెంచాలని, పీస్ రేట్ కింద కెజీ కాఫీ పళ్లకు రూ.10 చెల్లించాలని, గత ఏడాది అధికారులతో జరిగిన చర్చల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలని" డిమాండ్ చేశారు. సంస్థ స్థాపనకు 50 ఏళ్లు దాటినా రిటైర్ అయిన సిబ్బంది స్థానాల్లో ఖాళీ ఏర్పడిన తరువాత కూడా నేటికీ ఒక్క పోస్టు కూడా వేయలేదన్నారు. క్షేత్రస్థాయిలో లేని 'హెల్పర్' పోస్టులు సృష్టించి తోటల పనులు చేయిస్తూ, సంస్థ ఆదాయాన్ని అధికారుల జేబుల్లో వేసుకుంటున్నారన్నారు. హెల్పర్లకు కనీస వేతనాలు పెంచడం లేదన్నారు.యాజమాన్యం కార్మికుల సమస్యల పరిష్కారంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. సమస్యలన్నీ పరిష్కరించే వరకు సమ్మె ఉద్యమం కొనసాగుతుందని సి.పి.ఎం నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాఫీ హెల్పేర్లు కాంతమ్మ, సత్యనారాయణ, కన్నా నాథ్, వసంత ,అప్పలమ్మ, వరలక్ష్మి, చిన్నాలమ్మ, లత తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: సమస్యలను పరిష్కరించాలని చేపడుతున్న కాఫీ కార్మికుల సమ్మె గురువారం ఎనిమిదో రోజుకి చేరుకుంది. సమ్మెలో భాగంగా డివిజనల్ కార్యాలయం ఎదుట వంటా వార్పుతో నిరసన తెలియజేశారు. తమ డిమాండ్లు పరిష్కారం కాకుండానే అగ్రిమెంట్ కుదిరిందని డివిజనల్ మేనేజర్లు ప్రకటించడం పట్ల కార్మికులు తీవ్రంగా మండిపడ్డారు. సంస్థ రక్షణకై, కార్మికుల భవిష్యత్తు కోసం చేస్తున్న పోరాటాన్ని యాజమాన్యం పట్టించుకోలేదని ఆరోపించారు.సమస్యలు పూర్తిగా పరిష్కారం అయ్యేంత వరకు సమ్మె కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్, కాఫీ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోరి వెంకటగిరి, వెంకటేష్, కనకవల్లి, బాలకృష్ణ, నాగేశ్వరరావు, బలరాం తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో టిక్కిలి బెడ్డ



అంధకారంలో ఉన్న గ్రామంలోని వీధి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని గుంటసీమ రోడ్డు టిక్కిలిబెడ్డ వీధిలో వీధి దీపాలు లేక అంధకారంలో ఆ వీధి గ్రామస్తులు మగ్గు తున్నారు. విద్యుత్ స్తంభాలు ఉన్నప్పటికీ వీధి దీపాలు వెలకగ పోవడంతో అంధకారంలో మగ్గాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. వీధి దీపాలు లేక రాత్రుల్లో చిమ్మ చీకటిగా ఉండటంతో ఆ వీధి వాసులు రాకపోకలు సాగించడానికి పలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ గుంటసీమ రోడ్డు కానుకొని స్థానిక డుంబ్రిగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తోపాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల హాస్టల్, ఆశ్రమ పాఠశాల హాస్టల్ ఉన్నాయి. విద్యార్థులతో పాటు హాస్పిటల్ కు వెళ్లే వ్యాధిగ్రస్తులు సైతం వెళ్లి వైద్య సేవలు చేయించుకుంటారు. వీధి దీపాలు లేకపోవడంతో రాత్రుళ్లు ఆ రోడ్డు గుండా వెళ్లడానికి భయాందోళనకు గురవుతున్నారు. పంచాయతీ సిబ్బంది ఇంటి పన్ను వసూలు చేస్తున్నారని, వీధి దీపాలు ఏర్పాటు చేయడంతో మాత్రం శ్రద్ధ కనబరచ లేదని ఆ వీధివాసులు అంటున్నారు. విది. దీపాలు ఏర్పాటు చేయాలని పలుమార్లు సంబంధించి అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని ఆ వీధివాసులు ఆవేదన వ్యక్తం చేశాన్నారు.

17 నుంచి కుష్టు రోగుల గుర్తింపునకు సర్వే

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17 నుండి 30 వరకు వివిధ శాఖల సమన్వయంతో వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి కుష్టు రోగులను గుర్తించుటకు ప్రత్యేక సర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఏ. దినేష్ కుమార్ ఆదేశించారు. కలెక్టర్ తన కార్యాలయంలో గురువారం కుష్టు వ్యాధి గుర్తింపు, నిర్ధారణకు నిర్వహించే ప్రత్యేక కార్యాక్రమంపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కుష్టువ్యాధి నివారణపై ముద్రించిన పోస్టర్ ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మాట్లాడుతూ, అల్లూరి జిల్లలో 2022 నుండి 2025 ఏడాది వరకు 59 కేసులు నమోదవగా వీరిలో పురుషులు 38 మంది, స్త్రీలు 21 మంది ఉన్నారని వీరిలో చిన్నారులు 9 మంది వ్యాధి బారిన పడ్డారని అన్నారు. వీరిలో యం.బి కేసులు 42 కాగా, పి.బి 17 కేసులుగా గుర్తించి చికిత్సలు అందించామని ప్రస్తుతం 11 మందికి చికిత్సలు తీసుకుంటున్నారని వీరి ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని తెలియజేసారు. జిల్లాలోని 64 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధి లోని పారామెడికల్ సిబ్బంది పర్యవేక్షణలో వాలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి స్పర్శలేని మచ్చలు గుర్తించి వివరాలను నమోదుచేయాలని సూచించారు.గుర్తించిన అనుమానిత కేసులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి దగ్గర పరీక్ష చేయించి వారికి సంబందించిన చికిత్స అందించాలన్నారు. ఈ కార్యాక్రమంలో జిల్లా కుష్టు, ఎయిడ్స్, జిల్లా క్షయ అధికారి డాక్టర్ ఎం కిరణ్ కుమార్, ఆరోగ్య విస్తరణ అధికారి యం. సంజీవ పాత్రుడు పాల్గొన్నారు

టిడిపి సంస్థాగత ఇన్‌ఛార్జుల ప్రమాణ స్వీకారం

ప్రమాణ స్వీకారం చేయిస్తున్న దొన్నుదొర

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అరకులోయ నియోజకవర్గ కేంద్రంలో గురువారం జరిగిన తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు, కార్యదర్శులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జీల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్, నియోజకవర్గ ఇంచార్జీ సియ్యారి దొన్ను దొర అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో అరకులోయ నియోజకవర్గానికి చెందిన ఆరు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చారు.ఈ సందర్భంగా దొన్ను దొర మాట్లాడుతూ, ప్రతి ఇంటా పసుపు జెండా ఎగిరేలా ప్రతి కార్యకర్త కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. నాటి ఎన్టీ రామారావు దగ్గర నుంచి నేటి చంద్రబాబు నాయుడు వరకు గిరిజనుల అభివృద్ధి కోసం అత్యధిక ప్రాధాన్యం ఇచ్చిచ్చారన్నారు. గ్రామస్థాయి నుండి పార్టీ బలోపేతం చేయడం మనందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో అరకు నియోజకవర్గ మార్కెట్ యార్డ్ చైర్మన్ లక్ష్మి, అరకు నియోజకవర్గ పరిశీలకులు కరుణం శివ రామక్రిష్ణ, పెదలబుడు సర్పంచ్ పెట్టేలి దాసుబాబు, అరకులోయ మండల అధ్యక్షుడు ఎల్ మహాదేవ్, అరకులోయ మాజీ మండల అధ్యక్షుడు శెట్టి బాబురావు, టీడీపీ సీనియర్ నాయకులు పెనుమల అశోక్, మాజీ ఎంపీటీసీ దూరియ నూకరాజు, ఎంపిటిసి భీమరాజు, లక్ష్మి పాల్గొన్నారు.

తుపానుకు దెబ్బతిన్న కాలువ

వృథాగా పోతున్న నీరు

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని బీభత్సం సృష్టించిన మొంథా తుఫాను ప్రభావం కారణంగా పలు గ్రామాలలో దిగువ భాగంలో ఉన్న పంట కాలువలు దెబ్బతిన్నాయి. దీంతో సాగునీరు నిలిచి పోతున్న పరిస్థితి నెలకొంది. అనంతగిరి పంచాయతీ పరిధి తాడిగూడ గ్రామంలో పంట కాలువకు పెద్ద ఎత్తున వరద నీరు ప్రవేశించడంతో దెబ్బతింది. కాలువ ఆయకట్టుకు అనుకుని ఉన్న వందలాది ఎకరాల పంట పొలాలు ఉన్నాయి. వీటికి ఈ కాలువ ద్వారా సాగునీరు అందుతోంది. రెండోవ పంట రైతులకు సాగునీరు దొరకని పరిస్థితి తలెత్తే అవకాశం ఏర్పడనుంది. పాడైన కాలువలను మరమ్మత్తు పనులు చేపట్టాలని రైతులు కోరారు.

రెండు నెలల్లో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు పనులు ప్రారంభం

విజయవాడ విద్యుత్ సౌధ హైడల్ డైరెక్టర్ సుజయ్‌కుమార్

సీలేరు డ్యామ్‌ను పరిశీలిస్తున్న హైడల్ డైరెక్టర్ సుజయ్ కుమార్

ప్రజాశక్తి-సీలేరు : సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని సీలేరు జలవిద్యుత్ కేంద్ర సమీప పార్వతి నగర్ వద్ద నెలకొల్పే 1350 మెగావాట్లు సామర్థ్యం గల పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు పనులు మరో రెండు నెలల్లో ప్రారంభమవుతాయని విజయవాడ విద్యుత్ సౌద గుణదల హైడల్ డైరెక్టర్ సుజయ్ కుమార్ వెల్లడించారు. కాంప్లెక్స్ పరిధిలో గురువారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ముందుగా పొల్లూరు జల విద్యుత్ కేంద్రం వద్ద ఏపీ జెన్కో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 230 మెగావాట్ల సామర్థ్య గల 5, 6 యూనిట్లు నిర్మాణ పనులను పరిశీలించారు. యూనిట్లు ఎరక్షన్, పెన్ స్టాక్ పనులు, సివిల్ పనులు ఏ మేరకు జరుగుతున్నాయని ఈఈ బాలకృష్ణను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీలేరు జలవిద్యుత్ కేంద్రానికి చేరుకొని యూనిట్లు పనితీరును స్వయంగా పరిశీలించారు. విద్యుత్ ఉత్పత్తికి ఆటంకం లేకుండా సాంకేతిక లోపాలు తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలని ఈఈ రాజేంద్రప్రసాద్‌ను ఆదేశించారు. ఇంజనీర్లు కార్మికులు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీలేరు రెగ్యులేటరీ డ్యామ్, మెయిన్ డ్యామ్ పరిశీలించి గేట్లు పనితీరు నీటి నిల్వలు తదితర అంశాలపై సీలేరు కాంప్లెక్స్ ముఖ్య ఇంజనీరు రాజారావు, ఎస్ఇ సివిల్ చంద్రశేఖర్‌రెడ్డిలతో చర్చించారు. పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మాణపు ప్రదేశాన్ని స్వయంగా పరిశీలించారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుకు స్టేజ్ వన్ అనుమతులు ఇప్పటికే వచ్చాయని, స్టేజ్ టు అనుమతులు రావలసి ఉందని, మరో 15 రోజుల్లో అనుమతులు రావచ్చునని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ సౌదా ఎస్ఇ సివిల్ రవీందర్‌రెడ్డి, ఎం.శ్రీనివాస్ రెడ్డి, చిన్న కామేశ్వరరావు, భాస్కర్‌రావు, అప్పలనాయుడు, సిహెచ్ సురేష్, అనుదీప్ పాల్గొన్నారు.

గిరిజనులకు ఉద్యోగాలు కల్పించాలి

మోతుగూడెం : అల్లూరి జిల్లా, వై.రామవరం మండలం డొంకరాయి పరిసర ప్రాంతాల్లో ఏళ్ల తరబడి నివసిస్తున్న ఆదివాసీలకు ఏపీ జెన్కో ఆధ్వర్యంలో ఉన్న సీలేరు, డొంకాయ, మోతుగూడెం విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఉద్యోగాలు కల్పించాలని సిఐటియు, గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు విజయవాడ విద్యుత్ సౌధ హైడల్ డైరెక్టర్ సుజయ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆదివాసీలకు చట్టప్రకారం ఉద్యోగ రిజర్వేషన్ అమలు చేయడం లేదని, అందువల్ల ఇక్కడి యువత నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి స్పందించిన ఆయన బోర్డు యజమాన్యంతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చింత రాంబాబు, డొంకరాయి అధ్యక్షుడు డేవిడ్, గిరిజన సంఘం నాయకులు కే ముక్త, మంగల్ దన్, సురేష్, లైకన్ పాల్గొన్నారు.

విన్నవిస్తున్న సిఐటియు, గిరిజన సంఘం నేతలు

పెండింగ్‌లో ఉన్న రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలి

మండల సర్వసభ్య సమావేశంలో వైస్ ఎంపిపి పెంటయ్య

మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య

ప్రజాశక్తి-కూనవరం : మండల వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రోడ్డు నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ పాయం రంగమ్మ అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సమావేశంలో ఆయా శాఖల నుండి నివేదికలు సమర్పించారు. ఈ సందర్భంగా పెంటయ్య మాట్లాడుతూ మండల వ్యాప్తంగా చాలా గ్రామాల్లో సరైన రోడ్లు లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ పథకం పనులు చేయకపోవడంతో తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నారని సంబంధిత అధికారులను ప్రశ్నించారు. వరదలు వచ్చి ఇంతకాలమైనా నష్టపరిహారం అందిచడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఇటీవల వచ్చిన తూఫానుకు 198 ఎకరాలు వరి పంట, మిరప పంటలు దెబ్బ తిన్నాయని, కాని ప్రభుత్వం పట్టించు కోలేదని పేర్కొన్నారు. పోలవరం నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వకుండా జాప్యం చేస్తూ ప్రభుత్వాలు ముంపు ప్రాంత ప్రజలతో ఆడుకుంటున్నాయని ఆరోపించారు. కోతుల గుట్ట నుండి ఏడుగురాళ్ల పల్లి రోడ్డును వెంటనే నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు అమ్మాజీ, జయసుధ, సర్పంచులు నాగమణి, శంకర్, బొగ్గా వెంకమ్మ, నిరోషా, పార్వతి, వైస్ ఎంపీపీ సాంబ శివ, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మారుమూల గ్రామాలకు రహదారులు

ఐటిడిఎ పిఒ స్మరణ్ రాజ్

గిరిజన మహిళలతో సమావేశమైన రంపచోడవరం ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్

ప్రజాశక్తి మారేడుమిల్లి : మారుమూల గ్రామాలకు రోడ్లు, లింకు రోడ్లు ఏర్పాటు చేసే విధంగా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మండలంలోని పుల్లంగి గ్రామపంచాయతీ పరిధి పాముల మామిడి, గుండ్రాతి, బూసిగొంది గ్రామాల్లో పర్యటించారు. పాములమామిడి జిపిఎస్ పాఠశాలను పరిశీలించిన ఆయన ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు విద్యార్థులకు అర్థమవుతున్నది లేనిది విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఒకటికి రెండుసార్లు అర్థమయ్యే రీతిలో విద్యార్థులకు పాఠాలు బోదించాలని ఆదేశించారు. పాముల మామిడి గ్రామం వరకు రోడ్డు సమస్యలు పరిష్కరించే విధంగా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని చెప్పారు. గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలో అంగన్వాడి కేంద్రానికి పక్కా భవనం ఏర్పాటు చేయాలని కోరారు. పుల్లంగి జిసిసి డిఆర్ డిపో నుండి రేషన్ తెచ్చుకోవాలంటే చాలా ఇబ్బంది పడుతున్నామని, తమ గ్రామంలో సబ్ డిపో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన పిఒ సంబంధిత అధికారులతో చర్చించి సమస్యలు పరిష్కారానికి తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. గుండ్రాతి గ్రామంలో మహిళా సంఘాలతో ప్రాజెక్ట్ అధికారి సమావేశం నిర్వహించారు. మహిళా సంఘాలు తీసుకున్న రుణాలు ఎప్పటికప్పుడు చెల్లించి తిరిగి రుణాలు తీసుకొని వివిధ రకాలైన వ్యాపారాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు, డిఈ చైతన్య, మాజీ సర్పంచ్ మంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీ పరీక్షల్లో రింతాడ విద్యార్థుల ప్రతిభ

ప్రతిభ చూపిన విద్యార్థులు

ప్రజాశక్తి-జీకే.వీధి : దేశవ్యాప్తంగా ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో భారత ప్రభుత్వం జ్ఞాన భారతి ద్వారా నిర్వహించిన పరీక్ష లెవెల్-1లో గూడెం కొత్త వీధి మండలం రింతాడ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు. పాఠశాలకు చెందిన సాగిన తేజస్విని (10వ తరగతి), బిసుదొర శ్రీవల్లీ (10వ తరగతి), వంతల అఖిల (9వ తరగతి) ముగ్గురు విద్యార్థులు జాతీయస్థాయిలో అర్హత సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. రెండవసారి జరిగే జాతీయస్థాయిలో లెవెల్ 2 పరీక్షల్లో మరింత ప్రతిభ కనబరిచి భారత ప్రభుత్వం అందించే స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావాలని పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. ఈ మేరకు వారిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమిత్ర, వార్డెన్ గంగాభవాని, ఉపాధ్యాయులు అభినందించారు.

టిడిపి గ్రామ కమిటీల ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలం సీతపల్లి గ్రామం వద్ద గురువారం కొత్తగా ఎన్నికైన టిడిపి మండల క్లస్టర్‌లు, బూత్ ఇన్‌చార్జ్‌లు, గ్రామ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం జరిగింది. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి, నియోజకవర్గ పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాస యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు వంతల రాజేశ్వరి, చిన్నం బాబు రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మొత్తం 990 మంది కొత్తగా నియమితులైన నాయకులు ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో 11 మండలాలకు చెందిన ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

వంతెన, రోడ్లు నిర్మించాలని ఆందోళన

ఆందోళన చేపడుతున్న నేతలు, గిరిజనులు

ప్రజాశక్తి-పాడేరు:అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం దేవాపురం పంచాయతీలో మూడు గ్రామాలకు రోడ్డు, వంతెన నిర్మాణం చేయాలని డిమాండ్ చేస్తూ గెడ్డపై సొంతంగా నిర్మించుకున్న కట్టెల వంతెన వద్ద మూడు గ్రామాల గిరిజనులు గురువారం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఐరిక.నరసింహమూర్తి మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం దేవాపురం పంచాయతీలో తుమ్మలపాలెం, మొలకలపాలెం, అర్జాపురం ఈ మూడు గ్రామాలకు వంతెన, రోడ్డు లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని అన్నారు. ఈ సంవత్సరం వర్షాలు ఎక్కువగా పడడంతో ఆదివాసీ గిరిజనులు, విద్యార్థులు చదువుకోవడానికి వెళ్లాలన్న తీవ్రమైన ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. గెడ్డలో కట్టెల వంతెనపై నుంచి బిక్కుబిక్కు మంటూ రాక పోకలు సాగించాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే బ్రిడ్జి, రోడ్డు నిర్మాణం చేయాలని నరసింహమూర్తి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వంతు.రమేష్, కంగెటి ఈశ్వరావు, సిదరి పోతురాజు, గాడి.కొండలరావు, వంతు. వరలక్ష్మి, కొర్ర.రాజులమ్మ, అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు

వైసిపి కోటి సంతకాల సేకరణ

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కాశీపట్నం:రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, వైద్య కళాశాల ప్రైవేటీకరణపై వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో గురువారం బీంపోలు పంచాయతీలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఎంపీపీ నీలవేణి, వైసిపి అనంతగిరి మండల అధ్యక్షుడు కొర్ర సూర్యనారాయణ ఆధ్వర్యాన నిర్వహించారు. వైఎస్సార్సీపీ శాసనసభ్యులు రేగం మత్స్యలింగం మాట్లాడుతూ, ప్రభుత్వం కక్షపూరిత వైఖరితో వైద్య కళాశాల ప్రైవేటీకరణ చేస్తోందన్నారు. అన్నివర్గాల ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మద్దతు తెలపాలని మాజీ శాసన సభ్యులు శోభ హైమావతి కోరారు.

టిడిపి మండల అధ్యక్షునిగా సుబ్బారావు

ప్రజాశక్తి-కాశీపట్నం: తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్ష ఎన్నికలు జరిగాయి. అనంతగిరి మండలం తెదేపా మండల అధ్యక్షునిగా సోదేరి సుబ్బారావు ఎన్నికయ్యారు. అధ్యక్ష పదవికి సుబ్బారావు, నరేంద్ర పోటీపడగా సుబ్బారావుకు 27 మంది గ్రామ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు మద్దతు తెలిపారు. నరేంద్రకు 19 మంది మద్దతు తెలిపారు.ఇద్దరూ సభ్యులు హాజరు కాలేదు. నూతనంగా ఎన్నికైన తెదేపా అధ్యక్షుడు సుబ్బారావు మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

సుబ్బారావు

బిర్సాముండా స్ఫూర్తితో పోరాటం

ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు చిన్నయ్య పడాల్

ప్రజాశక్తి-చింతపల్లి:గిరిజన వీరుడు భగవాన్ బిర్సా ముండా చేసిన పోరాటం గిరిజనులకు ప్రేరణగా నిలవాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ పిలుపునిచ్చారు. ఆనాడు అమాయక గిరిజనులను వడ్డీ వ్యాపారులు తీవ్రంగా దోపిడీ చేసేవారని, బ్రిటీష్ పాలకులు ఈ దోపిడీదారులకు పరోక్షంగా మద్దతు ఇచ్చారని తెలిపారు.ఈ అన్యాయాలను చూసిన బిర్సా ముండా, గిరిజనులను ఏకతాటిపైకి తెచ్చి తిరుగుబాటు జెండా ఎగరేశారన్నారు.బ్రిటీష్ ప్రభుత్వం బిర్సా ముండాను అరెస్టు చేసి రాంచీ జైలులో నిర్బంధించిందని, అక్కడే ఆయన మరణించారని తెలిపారు. బిర్సా ఉద్యమం ఫలితంగా గిరిజన ప్రాంతాల్లో నివాస స్థలాల కేటాయింపులు, సర్వే కార్యక్రమాలు చేపట్టడం వంటి సంస్కరణలు జరిగాయని వివరించారు. ప్రస్తుతం కూడా గిరిజన గ్రామాల్లో వడ్డీ వ్యాపారులు నిలువు దోపిడీకి పాల్పడుతున్నారని, త్వరలో మండలాల వారీగా వీరి గుట్టును విప్పుతామని చిన్నయ్య పడాల్ హెచ్చరించారు. భూమి, అడవి, నీటిని రక్షించుకోవడం కోసం బిర్సా ముండా పోరాట స్ఫూర్తితో హైడ్రల్ పవర్ ప్రాజెక్టులను తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సాగిన నాగార్జున, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాంగి ధనుంజయ్, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

బిర్సాముండా చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న చిన్నయ్యపడాల్

చీడివలస పాఠశాలకు టీచర్‌ను నియమించాలి

మాట్లాడుతున్న నేతలు, గ్రామస్తులు

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలోని లుంగపర్తి స్కూల్ కాంప్లెక్స్ పరిధి చీడివలస ప్రాథమిక జీపీఎస్ టిడబ్ల్యు పాఠశాలల్లో టీచర్ ని తక్షణమే ఏర్పాటు చేయాలని విద్యార్థి సంఘం నాయకులు తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. గురువారం చీడివలస గ్రామంలో సందర్శించిన విద్యార్థి సంఘం నాయకులు బి.చంటిబాబు, బి. మాధవరావులు గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

అనంతరం పాఠశాలలో సందర్శించి విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ, పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడు ఉన్నత చదువుల నిమిత్తం గత సంవత్సర క్రితం నుండి వెళ్లి పోవడంతో ప్రస్తుతం బాషా వాలంటరీతో విద్యా బోధన జరుగుతుందని, వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని వారు డిమాండ్ చేశారు.

శారీరక నొప్పిపై నిర్లక్ష్యం చేయొద్దు

మెడికవర్ ఆసుపత్రి సీనియర్ పెయిన్ ఫిజీషియన్ డాక్టర్ ప్రవీణ్

ప్రజాశక్తి - ఆరిలోవ : నొప్పి అనేది కేవలం శారీరక అసౌకర్యం మాత్రమే కాదని, అది మనసును, జీవనశైలిని పూర్తిగా ప్రభావితం చేసే సమస్యగా శరీరం పంపే సంకేతమని మెడికవర్ ఆసుపత్రి సీనియర్ పెయిన్ ఫిజీషియన్ డాక్టర్ కెవిడి.ప్రవీణ్ అన్నారు. దీర్ఘకాలిక నొప్పితో రోజువారీ పనులు, నిద్ర, కుటుంబ జీవితం ఇలా పలుసమస్యలతో అనేక మంది బాధపడుతున్నారన్నారు . శారీరక నొప్పిని సమర్థవంతంగా అదుపుచేసే ఆధునికచికిత్సా పద్ధతులు నగరంలోని మెడికవర్ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్నాయని వివరించారు. గురువారం ఆరిలోవ మెడికవర్ కేన్సర్ ఆసుపత్రిలో మీడియాతో మాట్లాడుతూ నొప్పి అనేది శరీరం పంపే హెచ్చరిక సంకేతమని, దాన్ని పట్టించుకోకపోతే అది దీర్ఘకాలిక సమస్యగా మారుతుందన్నారు. నొప్పిని నిర్లక్ష్యం చేయకుండాసరైన వైద్య నిపుణుడిని సంప్రదిస్తే మళ్లీ సాధారణ జీవితాన్ని సులభంగానే పొందవచ్చని ప్రజల్లో అవగాహన కల్పిస్తు న్నామన్నారు. పెయిన్ ఫిజీషియన్లు కేవలం మందులు మాత్రమే కాకుండా, నొప్పి మూలకారణాన్ని గుర్తించి, దానిని శాశ్వతంగా తగ్గించే ఆధునిక చికిత్సలు అందిస్తారన్నారు. నడుం నొప్పి, ఆర్థరైటిస్, డయాబెటిక్ న్యూరోపతి, కేన్సర్ అనంతర నొప్పులు తదితర సమస్యలకు మెడికవర్‌లో ప్రత్యేక చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు.

మెడికవర్ ఆసుపత్రిలో రేడియో ఫ్రీక్వెన్సీ అబ్లేషన్, నర్వ్ బ్లాక్స్, ఎపిడ్యూరల్ ఇంజెక్షన్లు, టెండన్ బోటాక్స్ ఇంజెక్షన్లు తదితర ఆధునిక పద్ధతుల ద్వారా నొప్పిని 80 శాతం వరకు నియంత్రించవచ్చన్నారు. మూడు నెలలకంటే ఎక్కువ కాలం నొప్పి కొనసాగితే లేదా రోజువారీ పనుల్లో ఆటంకం కలిగిస్తే, వెంటనే పెయిన్ స్పెషలిస్ట్‌ను సంప్రదించాలన్నారు. మీడియా సమావేశంలో మెడికవర్ సెంటర్ హెడ్ డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ కిషోర్, డాక్టర్ సృజన, డాక్టర్ రోజాలిన్, డాక్టర్ ఇంగే పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ ప్రవీణ్

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న సిపిఎం సర్పంచ్ సునీత

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని గసబ పంచాయతీ నువ్వగూడ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక పంచాయతీ సిపిఎం సర్పంచ్ పి.సునీత శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ, పంచాయతీ నిధులతో గ్రామాల్లో జోరుగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. కంగారు సొల, గసబ గ్రామంలో సీసీ రోడ్డు పనులు పూర్తి అయ్యిందని చెప్పారు. అన్ని గ్రామంలో తాగు నీరు, విధ్యుత్ దీపాలు కల్పిస్తున్నామనీ చెప్పారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాంగి. సురేష్ కుమార్, పంచాయతీ వార్డ్ సభ్యులు పాంగి సత్యనారాయణ, పాంగి హరి, వైసీపీ నాయకులు వంతాల బలరాం, సిపిఎం నాయకులు పద్దు. బాస్కర్, సోమేల. సత్యనారాయణ, వంతాల. శివ , పంచాయతీ సెక్రటరీ జ్యోత్స్న పాల్గొన్నారు.

భూ సమస్యపై వినతి

ప్రజాశక్తి- అరకులోయ: అరకులోయ మండలం సరభగూడ గ్రామానికి చెందిన కొర్ర మధు తండ్రి కొర్ర సూరన్న పేరున్న భూమి మరో వ్యక్తి పేరుకు మార్చారని ఆరోపిస్తూ తహసీల్దార్ కు గురువారం ఫిర్యాదు చేశారు. భూ యాజమాని తెలిపిన వివరాల ప్రకారం ఖాతా నెం 179 , సర్వే నెం 441p తాను భూమి విక్రయం చేయకపోయినా, తన పేరున ఉన్న రికార్డులు ఎవరికో మార్పు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదును స్వీకరించిన తహసీల్దార్ మాట్లాడుతూ, సంబంధిత భూమిపై పూర్తి సర్వే నిర్వహించి, స్థల స్థితి పరిశీలనతో పాటు పత్రాల పరిశీలన జరిపి నిజానిజాలు వెలికితీస్తాం అని తెలిపారు. భూమి యజమాని మాట్లాడుతూ, తక్షణమే తన పేరును రికార్డుల్లో తిరిగి చేర్చాలని, మార్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



వినతిపత్రాన్ని ఇస్తున్న బాధితుడు

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

మండల విద్యాశాఖ అధికారి బాలాజీ

ప్రజాశక్తి- కాశీపట్నం:విధులకు వెళ్ళని ఉపాధ్యాయులపై చర్యలు తప్పవని అనంతగిరి మండల విద్యాశాఖ అధికారి కె బాలాజీ తెలిపారు. ఇటీవల ఎంపీపీ పాఠశాలకు చెందిన బుడ్డిగరువు, చింతలపాలెం పాఠశాలలో ఉపాధ్యాయులు విధులకు డుమ్మా కొడుతున్నట్టు పత్రికలలో వార్తలు వచ్చాయన్నారు. ఈ విషయంపై ఆన్లైన్లో ఇద్దరు టీచర్స్ నుండి వివరణ తీసుకోవడం జరిగిందన్నారు. మరోసారి పాఠశాల తనిఖీలో డుమ్మా కొట్టినట్టు తెలిస్తే ఆయా ఉపాధ్యాయులపై జిల్లా విద్యాశాఖ అధికారి తెలియజేసి శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎంఇఒ బాలాజీ

దట్టంగా కురుస్తున్న మంచు

పెరిగిన చలి తీవ్రత

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో గురువారం ఒక్కసారిగా చలి పులిగా మారింది. గురువారం తెల్లవారుజాము 3 గంటలు నుంచి ఉదయం ఎనిమిది గంటల వరకు సీలేరు పరిసర ప్రాంతాల్లో దట్టంగా మంచు కురిసింది. చల్లటి చిరుగాలులు వీసాయి. సీలేరు మంచు తెరలు కమ్ముకొని తెరచాపలా కప్పేసింది. దీంతో స్థానిక ప్రజలు చలికి తాళలేక అనేక ఇబ్బందులకు గురయ్యారు. ప్రతిరోజు ఉదయం 5 గంటలకు వాకింగ్ వెళ్లే వాకర్స్ సైతం మంచు తీవ్రతకు చలికి తట్టుకోలేక ఇల్లుకే పరిమితమయ్యారు. గురువారం సాయంత్రం సూర్య అస్తమయం కాకుండా మూడు గంటల నుంచి చల్లటి గాలులు వీస్తూ చలి ప్రారంభమైంది. రానున్న రోజుల్లో చలి తీవ్రతం మరింత పెరిగే అవకాశం ఉండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గురువారం తెల్లవారుజాము నుంచి మంచు తీవ్రత అధికం కావడంతో ఆంధ్రా ఒడిశా సరిహద్దు గిరిజనులు చలికి తాళలేక వణుకుపోతున్నారు. చలి మంటలు వేసుకొని ఉపశమనం పొందుతున్నారు.

పాఠశాలలో సామాజిక తనిఖీ

ప్రజాశక్తి-జీకే వీధి : రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆదేశాల మేరకు జీకే వీధి మండలం రింతాడ గవర్నమెంట్ ఆశ్రమ పాఠశాలలో ఎస్ఆర్‌పిలు అచ్యుత్‌రావు, చిరంజీవి, డిఆర్పీలు వెంకటేష్, పోతురాజు గురువారం సోషల్ ఆడిట్ చేశారు. పాఠశాలలో భోజనం తనిఖీ చేశారు. భోజనం గురించి ఆరా తీయగా పిల్లలు బాగానే ఉందని చెప్పారు. చిక్కీలు మాత్రం కాలం చెల్లిన స్టాక్ వేయగా అవి పిల్లలకు పెట్టలేదని ఉపాధ్యాయులు తెలిపారు. క్లాస్ రూమ్స్ సరిపోకపోవడంతో ఒకే రూమ్‌లో రెండు మూడు క్లాస్‌లు జరుగుతున్నాయని, డైనింగ్ హాల్ లేదని, టాయిలెట్స్‌లో వాటర్ సదుపాయం లేదని, పైపుల్లో జామ్ అయ్యాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్య కమిటీ చైర్మన్ మొట్టడం శరభన్న దొర, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థుల చదువుపై సిబ్బంది శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న టెన్త్ విద్యార్థుల చదువు పట్ల సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని స్థానిక ఎంఈఓ కెవివి సత్యనారాయణదొర అన్నారు. గురువారం ఆయన సింగంపల్లి, జడ్డంగి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో, జడ్డంగి జిల్లా పాఠశాలలో జరుగుతున్న ఎస్ఏ1 లెక్కలు పరీక్షలను పరిశీలించారు. పదవ తరగతి ఎస్ఏ1 ఫలితాలు ఆధారంగా సీ, డి గ్రేడ్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. 3వ తరగతి నుండి 9వ తరగతి వరకు సి, డి గ్రేడ్ విద్యార్థుల ప్రత్యేక బోధన ఎలా నిర్వహించడం, ఏ మెటీరియల్ ఉపయోగిస్తున్నారు, రిజిస్టార్, రికార్డులను ఎం ఈఓ పరిశీలించారు. కార్యక్రమంలో జడ్డంగి ఆశ్రమ పాఠశాల హెచ్ఎం శైలజ, ఇంచార్జ్ హెచ్ఎం లక్ష్మీబాయ్, ప్రసన్న కుమారి, ఉపాధ్యాయులు, సీఆర్పీలు విష్ణు, సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : టిడిపి అభివృద్ధికి కృషి చేస్తామని నూతనంగా నియమితులైన టిడిపి మండల ప్రధాన కార్యదర్శి వాసంశెట్టి గంగాధర్, మండల యువజన అధ్యక్షులు బారంగి అనుదీప్, ఉపాధ్యక్షులు సూరిశెట్టి సురేష్, జెట్టి మధు తెలిపారు. బుధవారం సాయంత్రం జరిగిన టిడిపి మండల విస్తృతస్థాయి సమావేశంలో వీరు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలో ప్రజా సమస్యలు గుర్తించి వాటి పరిష్కార దిశగా కృషి చేసి మండలంలో పార్టీ మరింత అభివృద్ధి చెందేలా తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. టీడీపీ అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు, సీనియర్ నాయకులు శివరామ చంద్రరాజు, సొసైటీ అధ్యక్షులు ముప్పన కేశవ్, మాజీ సొసైటీ అధ్యక్షులు గణజాల తాతారావ్, ఏఎంసీ చైర్మన్ లోతా లక్ష్మణరావు తదితరులు మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసిన వారిని అధిష్టానం గుర్తిస్తుందని చెప్పారు.

నేటి నుంచే సిఐఐ సమ్మిట్

ఉదయం 8.30 గంటలకే ప్రారంభం
ముఖ్య అతిథిగా ఉప రాష్ట్రపతి సిపి.రాధాకృష్ణన్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

శుక్ర, శనివారాల్లో జరగనున్న 30వ భారత పరిశ్రమల సమాఖ్య భాగస్వామ్య సదస్సు నిర్వహణకు ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ మైదానం సర్వం సిద్ధమైంది. భారత ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, సిఐఐ భాగస్వామ్యంతో సాగనున్న ఈ సదస్సుకు సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. సదస్సుకు ఆంధ్రప్రదేశ్ పెవీలియన్ ప్లీనరీ హాల్ ప్రధాన వేదికగా ఉండగా దానికి అనుబంధంగా వివిధ హాళ్లను ఏర్పాటు చేశారు. అక్కడ వివిధ ప్లీనరీ సెషన్లు జరగనున్నాయి.

రెండు రోజుల సిఐఐ సమ్మిట్‌లో భాగంగా 14న ఉదయం 8.30 గంటల నుంచి 10.30 గంటల వరకు ఆంధ్రప్రదేశ్ పెవీలియన్ ప్లీనరీ హాల్ 5లో ప్రారంభోత్సవ కార్యక్రమం జరగనుంది. భారత ఉప రాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా పాల్గొనుండగా రాష్ట్ర గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ గౌరవ అతిథిగా పాల్గొనున్నారు. అదే విధంగా కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖామాత్యులు పియూష్ గోయల్, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడులు కీలకోపాన్యాసం చేయనున్నారు. ఇంకా ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, నాదెండ్ల మనోహర్, టిజి.భరత్, సిఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ, పలువురు పరిశ్రమల ప్రతినిధులు, రాష్ట్ర మంత్రులు పాల్గొనున్నారు.

అనంతరం 10.30 గంటల నుండి 11.45 గంటల వరకు ఓపెనింగ్ ప్లీనరీ కార్యక్రమం జరుగుతుంది. గౌరవ అతిథులుగా కేంద్రమంత్రి పియుష్ గోయల్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొంటారు. అలాగే పలువురు పరిశ్రమల ప్రతినిధులు హాజరవుతారు. అదే సమయంలో వివిధ కాన్ఫరెన్స్ హాల్స్‌లో వివిధ ప్లీనరీ సెషన్లు జరగనున్నాయి. రెండో రోజు కార్యక్రమంలో భాగంగా ఉదయం 9.30 గంటల నుండి సాయంత్రం వరకూ వివిధ ప్లీనరీ హాల్స్‌లో పలు ప్లీనరీ సెషన్లు జరగనున్నాయి. అనంతరం సాయంత్రం 5 గంటల నుండి 5.45 గంటల వరకు సిఐఐ భాగస్వామ్య సదస్సు ముగింపు వేడుక ఉంటుంది.

సిద్ధమైన ప్రధాన వేదిక

రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ఆశ్రమ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మారేడుమిల్లి : బిర్సా ముండా జయంతి ఉత్సవాల్లో భాగంగా విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో మారేడుమిల్లి ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. వాలీబాల్, జావెలిన్ త్రోలో పి.బాలు రెడ్డి, పి.భద్రరావు రెడ్డి ద్వితీయ స్థానం సాధించి ప్రశంస పత్రాలు, జ్ఞాపికలు అందుకున్నారు. ఈ మేరకు వారిని గురువారం పాఠశాల హెచ్ఎం బి.చిన్నబాబు, డిప్యూటీ వార్డెన్ కోటేశ్వరరావు, పీడీ సుదర్శన్, పిఇటి లచ్చిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

రాజ్మా పంట పరిశీలన

ప్రజాశక్తి-జీకే.వీధి : మండలం పనసపల్లి గ్రామంలో రాజ్మా పంటను మండల వ్యవసాయ అధికారి డి.గిరిబాబు గురువారం పరిశీలించారు. గ్రామంలో సుమారుగా 200 ఎకరాల్లో రాజ్మా పంట సాగు చేశారని, ప్రస్తుతం రసం పీల్చే పురుగు అక్కడక్కడ కనిపిస్తుందని, దాని నివారణకు వేప నూనె పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకులు కృష్ణ పడాల్, రైతులు పాల్గొన్నారు.

బిర్సా ముండా జీవితం అందరికీ ఆదర్శం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : గిరిజన పోరాట యోధుడు బిర్సా ముండా జీవితాన్ని గిరిజనలు ఆదర్శంగా తీసుకోవాలని చికిలింత సర్పంచ్ కొండ్ల సూరిబాబు అన్నారు. మండలంలోని చికిలింత గ్రామ పంచాయతీ పరిధి ఆది సేవా కేంద్రం వద్ద జన జాతీయ గౌరవ దివస్ కార్యక్రమం పంచాయతీ కార్యదర్శి మహాలక్ష్మి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ కె సూరిబాబు బిర్సా ముండా జీవిత చరిత్ర గురించి వివరించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది చరణ్, సహదేవుడు, జోత్స్న, గ్రామస్తులు జి.ప్రియాంక, జి వెంకటలక్ష్మి, జె నూకరాజు, బి సోమరాజు పాల్గొన్నారు.

బిర్సా ముండా జయంతిని విజయవంతం చేయండి

జీకే.వీధి : జాతీయ జనజాతీయ దివస్ సందర్భంగా పాడేరులో ఈ నెల 16న జరుగు గిరిజన యోధుడు బిర్సా ముండా 150వ జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జనసేన నాయకులు గబులంగి గణేష్ గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పాడేరులో బిర్సా ముండా విగ్రహావిష్కరణ చేస్తున్నారని, దీనికి ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ, ఎపి గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ హాజరు కానున్నారని పేర్కొన్నారు. ఇందులో గిరిజన యువత, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మాట్లాడుతున్న సూరిబాబు

చేప పిల్లలు పంపిణీ చేస్తున్న ఎపిఒ

గిరిజనులకు చేప పిల్లల పంపిణీ

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏజెన్సీలో గిరిజన మత్స్య రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా ఐటీడీఏ కృషి చేస్తుందని రంపచోడవరం ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి (జనరల్) డిఎన్వి రమణ పేర్కొన్నారు. రంపచోడవరం మండలం, పందిరి మామిడిలో మత్స్యశాఖ ఆధ్వర్యాన గురువారం గిరిజనులకు చేప పిల్లలు పంపిణీ కార్యక్రమానికి ఎపిఒ రమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్ ఆదేశాల మేరకు గిరిజనులకు చేప పిల్లలు పంపిణీ చేసినట్టు చెప్పారు. జిల్లాలోని 22 మండలాల్లో 758 మంది మత్స్య గిరిజన రైతులు దరఖాస్తులు సమర్పించడం జరిగిందని పేర్కొన్నారు. 2025 -26 సంవత్సరానికి గాను రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో రంపచోడవరం, అడ్డతీగల, వై.రామవరం, గంగవరం, మారేడుమిల్లి మండలాల మత్స్య గిరిజన రైతులు వందమందికి శీలావతి 80 నుండి 100 ఎంఎం చేప పిల్లలు ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపార. 16 లక్షల రూపాయల వ్యయంతో 16 లక్షల చేప పిల్లలు అందించామన్నారు. కార్యక్రమంలో ఎఫ్డిఓ ఎ.అనిల్ కుమార్, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్లు సత్యనారాయణ, శివ సాయి, సత్యవతి, ఎఫ్ఎం కుమారి, రైతులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన

ప్రజాశక్తి-సీలేరు : వాహనాలు నడిపే డ్రైవర్లకు లైసెన్సు, ఇన్సూరెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని లేకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని సీలేరు ఎస్సై యాసీన్ హెచ్చరించారు. జీకే వీధి మండలం దారకొండలో గురువారం ఆటో డ్రైవర్లతో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై యాసీన్ మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని చెప్పారు. వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సోనియా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై సదస్సు

ప్రజాశక్తి-గంగవరం : స్థానిక ఐసిడిఎస్ సిడిపిఒ కార్యాలయంలో అంగన్వాడీ కార్యకర్తలకు మాదకద్రవ్యాలు, సైబర్ సురక్షితతపై సమగ్ర అవగాహన కార్యక్రమాన్ని ఎస్సై వెంకటేష్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి వల్ల అనర్థాలను తెలియజేశారు. మాదకద్రవ్యాల వాడేవారిని గుర్తించడం ద్వారా వారికి సకాలంలో పునరావాసం అందించడంపై అవగాహన కలిగించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగం ఈగల్ టోల్-ఫ్రీ నెంబర్ 1972 ద్వారా సంప్రదించవచ్చని సూచించారు. సైబర్ ముప్పులను గుర్తించడం, వ్యక్తిగత డేటాను రక్షించుకోవడం, సైబర్-సురక్షిత సమాజాన్ని పెంపొందించడంపై వివరించారు. ప్రభుత్వ ప్రారంభించిన సైబర్ టోల్ ఫ్రీ నెంబర్1930పై ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో సిడిపిఓ సుచరిత, ఏ డి ఐ లక్ష్మి, సూపర్వైజర్ కుమారి, సీత అంగన్వాడీ టీచర్స్ రాణి పాల్గొన్నారు.

50 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని వర్లాకులపాడు గ్రామంలో సంచార చికిత్స ప్రోగ్రాంలో భాగంగా జడ్డంగి పిహెచ్సి వైద్యాధికారి పావని వైద్య శిబిరం ఏర్పాటు చేసి 50 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వివిధ రుగ్మతలతో బాధపడుతున్న రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌వి రమణ, ఏఎన్ఎం కన్నయమ్మ, 104 సిబ్బంది శ్రీనివాసు, కనకరాజు, ఆశా వర్కర్, గ్రామస్తులు పాల్గొన్నారు.